


TGTEL/25/A31
నేటి దిక్సూచి
తెలుగు దిన పత్రిక

నేటి దిక్సూచి
తెలుగు దినపత్రిక
రిపోర్టర్స్ కావలెను
నూతనంగా వెలువడుతున్న నేటి దిక్సూచి తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలలో క్రింద తెలుపబడిన కాటగిరిలలో విలేకరులు కావలెను.
- జిల్లా బ్యూరో లు
- జిల్లా ఇంచార్జి లు
- నియోజకవర్గ రిపోర్టర్లు
- మండల రిపోర్టర్లు
ఆసక్తి గలవారు క్రింది నంబరును సంప్రదించండి
Call : 9100900931

ప్రచురణ. రంగారెడ్డి, సంపుటి:01 సంచిక :164 ఎడిటర్ పి. అలివేలు పేజిలు : 04, వెల. 2రూ/ శనివారం- 11 - జూలై- 2026

## సుప్రీంకోర్టులో ఊహించని ఘటన.. న్యాయమూర్తులపై ఆగ్రహించిన పిటిషనర్..




- సుప్రీంకోర్టులో ఇవాళ (శుక్రవారం) అనూహ్య పరిణామం చోటుచేసుకుంది.
- ఓ కేసు విచారణ సందర్భంగా పిటిషనర్ న్యాయమూర్తులపై తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డాడు.
- దీంతో కోర్టు హాలులో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో ఇవాళ (శుక్రవారం) అనూహ్య పరిణామం చోటుచేసుకుంది.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న విజయ్..
# 32 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు

- కరూర్ తొక్కిసలాట బాధితులకు నియామక పత్రాలు అందించిన ముఖ్యమంత్రి
- బాధితుల కష్టాలు చూసి భావోద్వేగానికి గురైన ముఖ్యమంత్రి
- బాధితుల స్మారకార్థం మెమోరియల్ నిర్మిస్తామని ప్రకటన
- కొనసాగుతున్న సీబీఐ విచారణ, ప్రతిపక్షాల విమర్శలు



ఢిల్లి : గతేడాది టీవీకే ర్యాలీలో చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటనలో మరణించిన వారి కుటుంబాలను తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ పరామర్శించారు. ఈ దుర్ఘటన జరిగి దాదాపు ఏడాది పూర్తవుతోంది. ఈ తరుణంలో, శుక్రవారం ఆయన కరూర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా బాధితుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రాలను ఆయన స్వయంగా అందజేశారు. కరూర్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో, బాధిత కుటుంబాల్లోని అర్హులైన 32 మందికి వారి విద్యార్హతలకు అనుగుణంగా ఉద్యోగాలను కేటాయించారు. ఇందులో జూనియర్ అసిస్టెంట్ పోస్టులతో పాటు ఎస్పీ కార్యాలయంలోని వివిధ విభాగాల్లో నియామకాలు జరిగాయి. మిగతా..2లో

## భారత తొలి హైడ్రోజన్ ట్రైన్ కు
# రైల్వే శాఖ ఆమోదం

- 74010/74009 రైలు నంబర్లతో ఈ సర్వీసు నడుస్తుందని రైల్వే వర్గాల వెల్లడి
- జర్మనీ, జపాన్, చైనా, అమెరికా వంటి దేశాల సరసన భారత్




ఢిల్లి : భారతదేశపు తొలి హైడ్రోజన్ రైలు త్వరలోనే పట్టాలు ఎక్కనుంది. జింద్-సోనిపత్ మధ్య డైలీ హైడ్రోజన్ రైలు సర్వీసును ప్రవేశపెట్టడానికి రైల్వే మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ఈ మేరకు సంబంధిత వర్గాలు తెలిపాయి. 74010/74009 రైలు నంబర్లతో ఈ సర్వీసు నడుస్తుందని చెప్పాయి. జింద్ సిటీ, పాండు పిండారా, లలిత్ ఖేడా, భంబేవా, ఇషాపుర్ ఖేరి, బుటానా, ఖంద్రాయ్, గోహానా, రభ్రా, లాత్, మోహనా, హరియాణా, బర్వాస్ని స్టేషన్లలో వాణిజ్యపరమైన స్టాపులు ఉంటాయని వర్గాలు పేర్కొన్నాయి. హైడ్రోజన్ రైలు రవాణాను వినియోగిస్తున్న జర్మనీ, జపాన్, చైనా, అమెరికా వంటి దేశాల సరసన భారతదేశం చేరనుంది. ఇప్పటికే జూన్‌లో ఢిల్లీ- జింద్ మధ్య హైడ్రోజన్ మిగతా..2లో

## హరీశ్ రావు కాంగ్రెస్‌లోకి వస్తానంటే పీపీసీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం




- పదేళ్ల అధికారంలో ఉన్న హరీశ్ రావు కుంగిపోయే ప్రాజెక్టులు కట్టారన్న మహేశ్ గౌడ్
- ఇప్పుడు ప్రభుత్వానికి గడువులు విధించడం హాస్యాస్పదమని వ్యాఖ్య
- ఈటల బీఆర్ఎస్ పార్టీకి వత్తాసు పలుకుతున్నట్టుగా ఉందని ఎద్దేవా

హైదరాబాద్: హైదరాబాద్ గాంధీ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రతిపక్షాలపై విమర్శల జడివాన కురిపించారు. ముఖ్యంగా బీఆర్ఎస్ నాయకుడు హరీశ్ రావును లక్ష్యంగా చేసుకుని ఘాటు వ్యాఖ్యలు చేశారు. పదేళ్ల అధికారంలో ఉండి కుంగిపోయే ప్రాజెక్టులు కట్టిన మీరు...

## భద్రాద్రి రామయ్య మీద ఒట్టు - వచ్చే ఎన్నికల్లో
# 117 సీట్లతో మళ్లీ మాదే అధికారం

- రైతు ఆశీర్వాద సభలో రైతు భరోసా నిధులు విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- బహిరంగ సభలో కీలక వ్యాఖ్యలు
- అసెంబ్లీ సీట్లు 119 నుంచి 182కు పెరుగుతాయని వెల్లడి



హైదరాబాద్: వచ్చే శాసనసభ ఎన్నికలు 2028 డిసెంబర్‌లో జరగవని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 2029 మే, జూన్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లు ఆమోదించుకునేందుకు బీజేపీ యత్నిస్తోందన్న రేవంత్ రెడ్డి, అసెంబ్లీ సీట్లు 119 నుంచి 182కు, పార్లమెంట్ సీట్లు 17 నుంచి 26కు పెరుగుతాయని వెల్లడించారు. భద్రాచలం రాముడి మీద ఒట్టు, వచ్చే ఎన్నికల్లో 117 సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే కేసీఆర్, అతని బంధువులు, దొంగ సర్వేలను ఓడిస్తామని సవాల్ చేశారు. ప్రతిపక్షాలను ఓడించేందుకు రోజూ 18 గంటలు పని చేస్తామని, కేసీఆర్ కుటుంబాన్ని మళ్లీ ఓడించే వరకు విశ్రమించనని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురంలో రైతు ఆశీర్వాద సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి, రైతు భరోసా నిధులను విడుదల చేసిన అనంతరం మాట్లాడారు. సభకు వచ్చిన ప్రజలను చూస్తుంటే తన గుండె పులకిస్తోందన్న సీఎం, రాజకీయంగా తనకు పాలమూరు ప్రాణమని, తన రాజకీయ ఎదుగుదలలో ఖమ్మం గుండెకాయగా పని చేసిందని తెలిపారు. గత ఎన్నికల సమయంలో కేసీఆర్ మాయమాటలు, మూటలతో ఎన్నికలకు వస్తున్నారని, వారిని ఎలా ఎదుర్కోగలరని మిగతా..2లో

## టీఆర్ఎస్‌ను గెలిపిస్తే.. రైతును
# రాజును చేసి చూపిస్తా



- తెలంగాణలో ఆదివాసీ బిడ్డలు బైక్ కొందామన్నా బ్యాంకులు లోన్ ఇవ్వడం తెలంగాణ రక్షణ సేన పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు.
- బ్యాంకులు లూటీ చేసిన వారి అప్పులు మాఫీ చేసిన బీజేపీ సర్కార్..
- గిరిజనులకు ఎందుకు రుణాలు ఇవ్వట్లేదు? అని ఆ పార్టీ నేతలను ఆమె సూటిగా ప్రశ్నించారు.

అశ్వారావుపేట, జులై 10: ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేనను గెలిపిస్తే.. రైతును రాజును చేసి చూపిస్తా అని ప్రజలకు ఆ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం రాగానే ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో రైతుకు ప్రత్యేక కుర్చీ వేయిస్తామని తెలిపారు. త్వరలోనే మహిళల కోసం ఒక ప్రత్యేకమైన వినూత్న ఆలోచనను చేశానని చెప్పారు. దీనిని త్వరలోనే ప్రకటిస్తానని పేర్కొన్నారు. అన్న రాజ్యం కాదు.. మిగతా..2లో


## జేఎన్‌టీయూ స్నాతకోత్సవం విజయనగరంలోనే జరపాలి: గవర్నర్‌కు బొత్స లేఖ



- జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం వేదికను మార్చొద్దన్న బొత్స
- విజయనగరం జిల్లాలోనే నిర్వహించాలని గవర్నర్‌కు విన్నపం
- విశాఖ ఆంధ్ర యూనివర్సిటీలో నిర్వహించాలనుకోవడం సరికాదని వ్యాఖ్య

అమరావతి: విజయనగరం జిల్లాలోని జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవం వేదికను మార్చాలన్న నిర్ణయంపై ఏపీ శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని విశాఖపట్నంలో కాకుండా విజయనగరంలోనే నిర్వహించేలా చొరవ తీసుకోవాలని కోరుతూ ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఆయన ఒక లేఖ రాశారు. స్నాతకోత్సవానికి తనను ఆహ్వానించినందుకు గవర్నర్ కు బొత్స ధన్యవాదాలు తెలిపారు. "విజయనగరం లాంటి వెనుకబడిన జిల్లాలో విద్యా రంగాన్ని పరుగులు పెట్టించేందుకు మిగతా..2లో

## హైదరాబాద్‌లో అగ్నిప్రమాదం.. డెకరేషన్ వస్తువుల గోదాంలో మంటలు



హైదరాబాద్ చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో అగ్నిప్రమాదం సంభవించింది.

చాదర్‌ఘాట్ మూసీ నది సమీపంలో ఉన్న ఒక డెకరేషన్ వస్తువుల గోదాంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.

హైదరాబాద్, జులై 10: నగరంలోని చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇవాళ (శుక్రవారం) అగ్నిప్రమాదం సంభవించింది. చాదర్‌ఘాట్ మూసీ నది సమీపంలో ఉన్న ఓ డెకరేషన్ వస్తువుల గోదాంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గోదాంలో ప్లాస్టిక్, థర్మాకోల్, బట్టలు వంటి సులభంగా అంటుకునే డెకరేషన్ వస్తువులు భారీగా నిల్వ ఉంచడంతో.. క్షణాల వ్యవధిలోనే మంటలు గోదాం అంతటా వ్యాపించాయి. దట్టమైన పొగతో పాటు మంటలు పెద్ద ఎత్తున పైకి ఎగిసిపడటంతో మిగతా..2లో

## అమరావతికి 'శాంసంగ్ సిటీ'.. కొరియా కంపెనీలతో మంత్రి లోకేశ్ కీలక భేటీలు





- దక్షిణ కొరియాలో పర్యటిస్తున్న మంత్రి నారా లోకేశ్
- ఏపీలో బ్యాటరీ తయారీ యూనిట్ ఏర్పాటుకు డెల్టా ఎక్స్‌కు ఆహ్వానం
- త్వరలో సానుకూల నిర్ణయం తీసుకుంటామన్న డెల్టా ఎక్స్ సీఈవో
- అమరావతిలో 'శాంసంగ్ సిటీ'కి లోకేశ్ ప్రతిపాదన
- ప్రతిపాదనలను ఉన్నతస్థాయి బృందంతో చర్చిస్తామన్న శాంసంగ్ ప్రతినిధులు

## సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననానికి
# పాల్పడేవారిపై చర్యలు

ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కు సీఎం చంద్రబాబు ఆదేశం

- సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిత్వ హననానికి పాల్పడేవారిపై చర్యలకు ఆదేశం
- టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సీఎం ఆదేశం
- మంత్రివర్గ అజెండా అంశాలు ముగిశాక తాజా పరిణామాలపై సీఎం చర్చ




అమరావతి : సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిత్వ హననానికి పాల్పడేవారిపై చర్యలకు టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. అవసరమైతే బయటనుంచి సిబ్బందిని తీసుకోవాలని సూచించారు. న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా అవసరమైతే కొత్తగా పీపీలను నియమించుకోవాలన్నారు. మంత్రివర్గ అజెండా అంశాలు ముగిశాక తాజా పరిణామాలపై మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చించారు. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత హననంపై సుదీర్ఘంగా చర్చించారు. డీజీపీ, ఇతర పోలీస్ అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా, నేతలను కించపరుస్తూ వస్తున్న వీడియోలపై మంత్రులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మిగతా..2లో

## రూ.9,355 కోట్లతో 10 మల్టీ విలేజ్ డ్రింకింగ్ వాటర్ స్కీమ్స్ ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలివే



- సీఎం చంద్రబాబు అధ్యక్షతన ముగిసిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం
- దాదాపు 30కి పైగా అజెండా అంశాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం
- రూ.1,811 కోట్లతో తాగునీటి పథకాలకు అనుమతించిన మంత్రివర్గం

అమరావతి : రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 10 మల్టీ విలేజ్ డ్రింకింగ్ వాటర్ స్కీమ్స్‌కు రూ.9,355 కోట్ల మంజూరుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలకు 2,943 తాగునీటి పథకాలు రూ.1,811 కోట్లతో చేపట్టేందుకు పరిపాలనా అనుమతులు ఇచ్చింది. మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

## జేఎన్‌టీయూ స్నాతకోత్సవం విజయనగరంలోనే జరపాలి: గవర్నర్‌కు బొత్స లేఖ

ఈ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం. అలాంటి ప్రతిష్ఠాత్మక సంస్థకు సంబంధించిన మొట్టమొదటి స్నాతకోత్సవాన్ని అదే జిల్లాలో జరపడమే అత్యంత సముచితం. ఈ అట్టహాస వేడుకను విజయనగరంలో కాకుండా, విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించాలని అనుకోవడం సరికాదు. ఈ నిర్ణయం వల్ల విజయనగరం జిల్లా ప్రజల ఆత్మగౌరవం దెబ్బతింటుంది. అక్కడ ఈ వేదిక మార్పుపై తీవ్ర నిరసనలు, తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నాయి. స్థానిక ప్రజల, విద్యార్థుల ఆకాంక్షలు, ఆనందాన్ని గౌరవించాల్సిన బాధ్యత మనపై ఉంది. కాబట్టి, విజయనగరం జిల్లా వాసుల సెంటిమెంట్‌ను పరిగణనలోకి తీసుకుని, యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవాన్ని విజయనగరంలోనే నిర్వహించేలా ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించండి" అని తన లేఖ ద్వారా బొత్స కోరారు.

## రూ.9,355 కోట్లతో 10 మల్టీ విలేజ్ డ్రింకింగ్ వాటర్ స్కీమ్స్ - ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలివే

సీఎం చంద్రబాబు అధ్యక్షతన ముగిసిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో దాదాపు 30కి పైగా అజెండా అంశాలకు ఆమోదం తెలిపారు. విశాఖలో ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. తిరుపతి జిల్లాలో 63 ఎకరాల్లో లాజిస్టిక్స్ పార్క్ ఏర్పాటుపై చర్చ జరిగింది. పర్యాటక పాలసీలో భాగంగా రాష్ట్రంలో కాన్సర్ట్‌ల నిర్వహణ, కాన్సర్ట్‌లకు ప్రత్యేక విధానం ప్రతిపాదనకు ఆమోదం లభించింది. అదేవిధంగా రూ.50 కోట్లతో పర్యాటక ప్రచారానికి ఆమోదం తెలిపిన కేబినెట్, నెల్లూరులో ఐటీసీ హోటల్, కడపలో మాధవి హోటల్‌కు, విజయవాడలో సరోవర్ పోర్టికో హోటల్‌కు, కడపలో ఇంటిగ్రేటెడ్ అమ్యూజ్‌మెంట్ పార్క్‌కు ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు నిర్ణయించింది.

రూ.9,355 కోట్లతో 10 మల్టీ విలేజ్ డ్రింకింగ్ వాటర్ స్కీమ్స్ - ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలివే

విశాఖ, గుంటూరు, నెల్లూరులో అంబేడ్కర్ గురుకుల సీవోఈ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఐఐటీ జేఈఈ, నీట్‌కు రెసిడెన్షియల్ కోచింగ్ ప్రతిపాదనలకు అనుమతి ఇచ్చింది. పెద్దగెడ్డ రిజర్వాయర్ కమాండ్ ఏరియా ఆధునికీకరణకు, కుప్పంలో ఫీడర్ ఛానెల్స్, బీరగానిపల్లె రిజర్వాయర్‌కు ఆమోదం తెలిపింది. ఎస్ఐపీబీ సిఫార్సులతో భారీ పెట్టుబడులకు ప్రోత్సాహకాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సీఆర్‌డీఏ అథారిటీ ఆమోదించిన సంస్థలకు భూకేటాయింపులకు అనుమతులు ఇచ్చింది.

## హరీశ్ రావు కాంగ్రెస్‌లోకి వస్తానంటే పీఏసీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం

ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి గడువులు విధించడం హాస్యాస్పదమని మహేశ్ గౌడ్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ మార్క్ అభివృద్ధి చూసి ఆయనకు మిట్టమధ్యాహ్నమే చుక్కలు కనిపిస్తున్నాయన్నారు. హరీశ్ రావు ఒకవేళ కాంగ్రెస్‌లోకి వస్తానంటే... తమ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీలో (పీఏసీ) చర్చించి నిర్ణయం తీసుకుంటామని వ్యాఖ్యానించారు. ఒక ప్రాంతీయ పార్టీ అయిన బీఆర్ఎస్ ఖాతాలో రూ.1,400 కోట్లు ఎలా జమ అయ్యాయో చెప్పాలని నిలదీశారు. నాడు బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా ఉండి నీళ్ల దోపిడీని ప్రశ్నించని ప్రస్తుత బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్... ఇప్పుడు అదే బీఆర్ఎస్ పార్టీకి వత్తాసు పలుకుతున్నట్టుగా కనిపిస్తోందని అన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న బీజేపీ హామీ ఏమైందని ప్రశ్నించారు. గత 12 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం ఎన్ని ఉద్యోగాలు కల్పించిందో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌లో క్రమశిక్షణ అందరికీ ఒకటేనని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. కడియం శ్రీహరి, కొండా సురేఖ వివాదాలపై సచిన్ సావంత్, జగ్గారెడ్డిలతో కూడిన కమిటీ నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయన్నారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ప్రతినిధులతో చర్చించి ఈ నెల 15న కొలిక్కి తెస్తామని కీలక అప్‌డేట్ ఇచ్చారు.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న విజయ్.. 32 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు

బాధితుల కుటుంబ సభ్యులతో మాట్లాడిన సమయంలో ముఖ్యమంత్రి విజయ్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారని, తమ గోడు విని ఆయన కంటతడి పెట్టుకున్నారని బాధితురాలు ధనలక్ష్మి పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో భర్తను కోల్పోయిన నివేదిక అనే మహిళకు జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం లభించగా, ఈ నియామకం తమ కుటుంబ భవిష్యత్తుకు భరోసా కల్పిస్తుందని ఆమె కృతజ్ఞతలు తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున రూ. 10 లక్షల పరిహారం అందజేయగా, టీవీకే పార్టీ తరఫున ఒక్కో కుటుంబానికి రూ. 20 లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ, కరూర్ తొక్కిసలాట ఘటన తన జీవితంలో ఒక మాయని గాయమని, అత్యంత బాధాకరమైన అనుభవమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాటి ర్యాలీలో పోలీసుల భద్రతా ఏర్పాట్లను విశ్వసించానని, అయితే జన నియంత్రణలో వైఫల్యాలు ఎందుకు చోటుచేసుకున్నాయన్న అంశంపై సమీక్షిస్తున్నట్లు తెలిపారు. మృతుల జ్ఞాపకార్థం పార్టీ తరఫున ఒక స్మారక చిహ్నాన్ని నిర్మిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## సుప్రీంకోర్టులో ఊహించని ఘటన.. న్యాయమూర్తులపై ఆగ్రహించిన పిటిషనర్..

ఓ కేసు విచారణ సందర్భంగా పిటిషనర్ న్యాయమూర్తులపై తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డాడు. దీంతో కోర్టు హాలులో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనంతరం నిందితుడు చేతిలో ఉన్న కేసు పత్రాల కట్టను న్యాయమూర్తుల డయాస్ వైపు విసిరేయడంతో భద్రతా అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. పిటిషనర్‌ను బలవంతంగా కోర్టు హాలు నుంచి బయటకు తీసుకెళ్లారు. ఈ ఘటన న్యాయమూర్తులు జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ అలోక్ అరాధే ధర్మాసనం కేసు విచారణ చేస్తున్న సమయంలో జరిగింది. అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఓ తీర్పును సవాల్ చేస్తూ పిటిషనర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. నేడు విచారణ సందర్భంగా స్వయంగా హాజరై తన వాదనలు వినిపించే క్రమంలో అసాధారణంగా దూకుడుగా ప్రవర్తించాడు. వాదనలు ప్రారంభించిన వెంటనే 'లక్నో ఏసీపీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని నేను ఆదేశిస్తున్నా' అంటూ న్యాయమూర్తులను ఉద్దేశించి వ్యాఖ్యానించాడు. దీంతో ఆశ్చర్యానికి గురైన జస్టిస్ కేవీ విశ్వనాథన్.. 'మీరు మమ్మల్ని ఆదేశిస్తున్నారా?' అని ప్రశ్నించారు. దీనికి స్పందించిన పిటిషనర్ 'నా తరఫున చెప్పాల్సిందంతా చెప్పాను. అన్నీ రికార్డుల్లో ఉన్నాయి' అని పేర్కొన్నాడు. అనంతరం ఒక్కసారిగా ఆగ్రహానికి లోనై కేసు పత్రాలను గాల్లోకి విసిరేయడంతో పాటు, కోర్టు హాలులోనే న్యాయమూర్తులను ఉద్దేశించి అసభ్య పదజాలంతో దూషించాడు. దీంతో అక్కడే ఉన్న భద్రతా సిబ్బంది వెంటనే స్పందించి పిటిషనర్‌ను అదుపులోకి తీసుకుని కోర్టు హాలు నుంచి బయటకు తరలించారు. ఈ ఘటనతో కొద్దిసేపు కోర్టు హాలులో కలకలం రేగింది. అయినా న్యాయమూర్తులు ఏమాత్రం సహనం కోల్పోకుండా విచారణను కొనసాగించడం విశేషం.

## హైదరాబాద్‌లో అగ్నిప్రమాదం.. డెకరేషన్ వస్తువుల గోదాంలో మంటలు

స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ప్రమాదంపై సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తమయ్యారు. రెండు ఫైరింజన్లు తక్షణమే ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. మంటలు పక్కనే ఉన్న ఇతర భవనాలకు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రమాదానికి గల కారణాలు (షార్ట్ సర్క్యూట్ లేదా మరేదైనా కారణమా అనేది) ఇంకా తెలియరాలేదు. ప్రస్తుతం ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ప్రాథమిక సమాచారం అందుతోంది. పోలీసులు కూడా ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తూ, సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

## ఈ20 పెట్రోల్‌తో వాహనాల మైలేజీ 3 నుంచి 5 శాతం తగ్గొచ్చు

### ఈ 20 పెట్రోల్‌తో మంచి ఇంజన్ పనితీరు, మెరుగైన పికప్, తక్కువ కర్బన ఉద్గారాల విడుదల వంటి ఉపయోగాలు ఉన్నాయని వెల్లడి

ఇథనాల్ 20 పెట్రోల్ కారణంగా కొన్ని వాహనాల్లో మైలేజీ 3 నుంచి 5 శాతం తగ్గొచ్చని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కానీ దీని ప్రభావం కంటే ప్రయోజనాలే ఎక్కువ ఉన్నాయని వివరించింది. ఈ 20 పెట్రోల్‌తో మంచి ఇంజన్ పనితీరు, మెరుగైన పికప్, తక్కువ కర్బన ఉద్గారాల విడుదల వంటి ఉపయోగాలు ఉన్నాయని తెలిపింది. ఇది అధిక నాణ్యత, సమర్థవంతమైన ఇంధనం అని పేర్కొంది. అనేక సంవత్సరాలుగా శాస్త్రీయ పరీక్షల తర్వాతే దీనిని ప్రవేశపెట్టినట్లు తెలిపింది. ఈ మేరకు పెట్రోల్ లో ఇథనాల్ ను కలిపే కార్యక్రమంపై వస్తున్న విమర్శలను తిప్పికొట్టేందుకు 'సందేహాలు- సమాధానాలు' పేరుతో ఒక డాక్యుమెంట్‌ను శుక్రవారం విడుదల చేసింది. కలిపే ప్రక్రియను చాలా వేగంగా అమలు చేశారన్న ఆందోళనలను మంత్రిత్వ శాఖ తోసిపుచ్చింది. సైంటిఫిక్ పరీక్షలు, ఆటోమొబైల్ తయారీదారులతో సంప్రదింపులు, దేశీయంగా ఇథనాల్ ఉత్పత్తి పెంపు చేపట్టిన అనంతరమే దశలవారీగా ఈ20 పెట్రోల్ వినియోగాన్ని తీసుకొచ్చినట్లు వివరించింది. భారత్ లో ఈ కార్యక్రమం 2001లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైందని, 2006 నాటికి దేశంలోని కొన్ని ప్రాంతాల్లో 5 శాతం బ్లెండింగ్ అమల్లోకి తీసుకొచ్చినట్లు తెలిపింది. 2014లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చే వరకు 1.5 శాతం ఇథనాల్ బ్లెండింగ్ విధానమే అమల్లో ఉందని చెప్పింది. 2018లో జీవ ఇంధనాలపై జాతీయ విధానాన్ని ప్రవేశపెట్టి ఉత్పత్తిని ప్రభుత్వం వేగవంతం చేసిందని తెలిపింది. ప్రత్యేక ఇథనాల్ ప్లాంట్లు, నిల్వ, లాజిస్టిక్స్‌లో పెట్టుబడుల తర్వాత భారత్

# సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననానికి పాల్పడేవారిపై చర్యలు

మొదటి పేజి తరువాయి

భావ ప్రకటన స్వేచ్ఛను గౌరవిస్తూనే అభ్యంతరకర వ్యాఖ్యలను మాత్రం ఉపేక్షించవద్దని పోలీస్ అధికారులకు సూచించారు. ప్రభుత్వంపై అభూత కల్పనలు, అసత్యాలు, అసలు విషయాలు వక్రీకరిస్తే మాత్రం ఉపేక్షించవద్దని మంత్రులు గట్టిగా కోరారు. వైఎస్సార్సీపీ వాళ్లు రెచ్చగొడితే రెచ్చిపోవద్దు : ఈరోజు నుంచే పోలీస్ యంత్రాంగం సోషల్ మీడియాపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించాలని చంద్రబాబు ఆదేశించారు. ఇప్పటికే సోషల్ మీడియాపై ప్రభుత్వం నియమించిన కేబినెట్ సబ్ కమిటీలో కూడా చర్చించాలన్నారు. వైఎస్సార్సీపీ నేతలు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం పై నుంచి దృష్టి మరల్చేందుకు కొత్త పద్ధతి ఎన్నుకున్నారని, కావాలని కూటమి నేతలను రెచ్చగొడుతున్నారని సీఎం మంత్రులకు చెప్పారు. వైఎస్సార్సీపీ వాళ్లు రెచ్చగొడితే రెచ్చిపోవద్దని సీఎం సూచించారు. అనంతపురం, మిగతా జిల్లాలలో జరిగిన సంఘటనలను ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. ఇన్‌ఛార్జి మంత్రులు రెవెన్యూ, ఇతర సమస్యలపై కూడా దృష్టి సారించాలని ఆదేశించారు. ఆయా జిల్లాలో ప్రతి అంశంపై ఇంచార్జి మంత్రులు దృష్టి కేంద్రీకరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. బ్లేడ్ బ్యాచ్ కి తోడు గంజాయ్ బ్యాచ్ : మరోవైపు కులపరమైన అంశాలు, తప్పుడు వార్తలు సామాజిక మాధ్యమాల్లో వేగంగా స్ప్రెడ్ చేస్తున్నారని



ముఖ్యమంత్రి చంద్రబాబు మండిపడ్డారు. తమ స్వార్థ రాజకీయాలకు బ్లేడ్ బ్యాచ్ కి తోడు గంజాయ్ బ్యాచ్ ని అడ్డంపెట్టుకుని కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వీటిపై పూర్తి నియంత్రణ రావాలని సీఎం ఆదేశించారు. అనంతపురంలో తోపుదుర్తి దాడులకు కుట్రలు పన్ని రెచ్చగొట్టే ట్రాప్ పన్నాడని మంత్రుల మధ్య చర్చ జరిగింది. సామాజిక మాధ్యమాల్లో ఫేక్ వార్తల నియంత్రణకు హోంశాఖ – న్యాయ శాఖ కలిసి పనిచేయాలన్నది పవన్ కల్యాణ్ అభిమతంగా నాదెండ్ల మనోహర్ చెప్పారు. వాట్సాప్ యూజర్ నేమ్ అందుబాటులోకి వస్తే సోషల్ మీడియా సమస్యలు అధికమవుతాయని డీజీపీ అభిప్రాపడ్డారు. జలాధార 100 రోజుల కార్యక్రమంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరా తీశారు. జిల్లాల వారీగా జలాధారపై మంత్రులు సమీక్షించాలని ఆదేశించారు. శాఖాపరంగా ప్రభుత్వ భూ వివాదాలను మంత్రులు పరిష్కరించాలని సీఎం సూచించారు. ఎల్ నినో ప్రభావంతో చోటు చేసుకుంటున్న వాతావరణ హెచ్చుతగ్గులపై ప్రతీ ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. ఆగస్టు 3న ప్రారంభించే 210 ఉద్యానవన క్లస్టర్స్ ప్రారంభోత్సవంలో నేతలంతా పాల్గొనాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రిపీటెడ్ గా వచ్చే అర్జీలు ఎందుకు పరిష్కారం కావట్లేదో అధ్యయనం చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. సైబర్ క్రైమ్ సమస్యల పరిష్కారం కోసం ఐజీ స్థాయి అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. రూ.లక్షా 50 వేల వరకు వ్యవసాయ రుణమాఫీ : అంతకుముందు సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో 30కి పైగా కీలక అంశాలకు ఆమోదం తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు రూ.9,355 కోట్ల అంచనా వ్యయంతో 10 మల్టీ విలేజ్ డ్రింకింగ్ వాటర్ స్కీమ్స్‌కు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. వీటితో పాటు తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న ప్రాంతాల కోసం రూ.1,811 వ్యయంతో 2,943 తాగునీటి పథకాలను చేపట్టేందుకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. రాజధాని అమరావతి నిర్మాణం కోసం రెండో విడత భూసమీకరణలో భాగస్వాములైన 7 గ్రామాల రైతులకు ప్రభుత్వం అండగా నిలిచింది. ఈ పరిధిలోని ప్రతి రైతు కుటుంబానికి గరిష్ఠంగా లక్షా 50 వేల వరకు వ్యవసాయ రుణమాఫీ వర్తింపజేసే ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

# టీఆర్ఎస్‌ను గెలిపిస్తే.. రైతును రాజును చేసి చూపిస్తా

మొదటి పేజి తరువాయి

'అక్క రాజ్యం' ఎలా ఉంటుందో చేసి చూపిస్తానని తెలిపారు. కొత్త పార్టీలో మార్పులు ఉంటాయని.. 'పాంచజన్యం' పేరుతో ముందుకు వెళ్తామని ఈ సందర్భంగా ఆమె చెప్పారు. ఎంత పెద్ద సమస్యకైనా మొదటి అడుగుతోనే పరిష్కారం.. తన ప్రయాణానికి మీ సహకారం కావాలని ప్రజలను కోరారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం కొత్త గంగారం గ్రామం ఆదివాసి నాయకపోడు గ్రామాల్లో సమస్యలు వారి జీవన విధానాన్ని తెలంగాణ రక్షణ పార్టీ అధ్యక్షురాలు (౧=ా) కల్వకుంట్ల కవిత పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడారు. రాజకీయాల కోసం రాలేదని.. ప్రజా సమస్యలు తెలుసుకోవడానికే మీ ముందుకు వచ్చానని అన్నారు. వెనకబడిన ఆదివాసీ గిరిజనుల కోసమే 'తెలంగాణ రక్షణ సేన' పార్టీని స్థాపించానని వివరించారు. సమాజంలో ఉన్న వెనకబడిన వ్యవస్థను మార్చడానికే ఆడబిడ్డగా ధైర్యంగా తాను ముందుకు వచ్చానని పేర్కొన్నారు. మీ గ్రామానికి రావడం పుట్టింటికి వచ్చినట్లుగా ఉంది.. గ్రామ దేవతల దర్శనం కల్పించిన ప్రజలకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణలో ఎక్కడా మార్పు రాలేదు.. నిరుద్యోగం, కరెంట్ కష్టాలు ఇంకా పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకపోడు జాతిని 'గోండు నాయకపోడు' అని పిలవడం తీవ్ర బాధాకరమని అన్నారు. 1950 రికార్డుల్లో నాయకపోడు పేరు లేకపోవడం దురదృష్టకరం.. గిరిజనుల హక్కుల కోసం ఢిల్లీ దాకా పోరాడుతామని పేర్కొన్నారు. తెలంగాణలో ఆదివాసీకి బిడ్డలు బైక్ కొందామన్నా బ్యాంకులు లోన్ ఇవ్వడం లేదని అన్నారు. బ్యాంకులు లూటీ చేసిన వారి అప్పులు మాఫీ చేసిన బీజేపీ సర్కార్.. గిరిజనులకు ఎందుకు రుణాలు ఇవ్వట్లేదు? అని ఆ పార్టీ నేతలను కవిత సూటిగా ప్రశ్నించారు. విదేశాల తరహాలో ఇక్కడి ఆదివాసీలకు రూ.2 లక్షల నుంచి రూ.2 కోట్ల వరకు బ్యాంక్ లోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



ఆదివాసీ పిల్లలందరికీ ఉచిత విద్య, వైద్యం అందించాలి.. ఇది వారి ప్రాథమిక హక్కు అని అన్నారు. ఎస్టీలకు కేటాయించిన వేల కోట్ల రూపాయలను ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని కల్వకుంట్ల కవిత ఆరోపించారు.

# అమరావతికి 'శాంసంగ్ సిటీ'.. కొరియా కంపెనీలతో మంత్రి లోకేశ్ కీలక భేటీలు

మొదటి పేజి తరువాయి

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌ను అత్యాధునిక సాంకేతికత, పారిశ్రామిక పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ తన దక్షిణ కొరియా పర్యటనలో కీలక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ (బీఈఎస్ఎస్) తయారీలో పేరొందిన డెల్టా ఎక్స్, ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శాంసంగ్ కంపెనీల ఉన్నతాధికారులతో ఆయన వేర్వేరుగా భేటీ అయ్యారు. ఏపీలో భారీ ఎత్తున తయారీ, పరిశోధన యూనిట్లను స్థాపించాలని ఆయన ఈ కంపెనీలను ఆహ్వానించారు.

### ఏపీలో బ్యాటరీ యూనిట్‌కు డెల్టా ఎక్స్ సానుకూలం

సియోల్‌లో డెల్టా ఎక్స్ ఫౌండర్, సీఈవో స్టీఫెన్ కిమ్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ, 25 గిగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ ప్రాజెక్టుల లక్ష్యంతో ముందుకు సాగుతోందని వివరించారు. ఈ ప్రణాళికలకు అనుగుణంగా రాష్ట్రంలో సోలార్ మాడ్యూళ్లు, బ్యాటరీ సెల్స్ తయారీకి అనువైన పర్యావరణాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. పోర్టులు, మౌలిక సదుపాయాలు పుష్కలంగా ఉన్న ఏపీలో ఒక



బీఈఎస్ఎస్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఆయన డెల్టా ఎక్స్‌ను కోరారు. దీనికి డెల్టా ఎక్స్ సీఈవో స్టీఫెన్ కిమ్ సానుకూలంగా స్పందించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆంధ్రప్రదేశ్‌లో తయారీ యూనిట్ ఏర్పాటుపై త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటామని ఆయన మంత్రికి తెలిపారు.

### శాంసంగ్‌కు భారీ ప్రతిపాదనలు

అనంతరం, ప్రపంచ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ యంగ్ జో యున్‌తో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు గల అవకాశాలను వివరిస్తూ పలు ప్రతిపాదనలు చేశారు. ఏఐ, డేటా సెంటర్ హబ్: రాష్ట్రంలోని 10 గిగావాట్ల డేటా సెంటర్ పైప్‌లైన్‌ను ఉపయోగించుకుని, ఏఐ-కంప్యూట్, సర్వర్ తయారీ, సర్వీసింగ్‌లో ఆంధ్రప్రదేశ్‌ను శాంసంగ్‌కు ప్రధాన కేంద్రంగా మార్చాలని లోకేశ్ కోరారు. తయారీ యూనిట్లు: ఏపీలో ఒక డిస్‌ప్లే ఫ్యాబ్, విశాఖపట్నంలోని ఐఎస్ఎం ఓఎస్ఏటీ క్లస్టర్‌ను ఆధారంగా చేసుకుని కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, మొబైల్స్ కోసం ఒక సెమీకండక్టర్ యూనిట్ (ఓఎస్ఏటీ) ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, రాష్ట్ర పునరుత్పాదక ఇంధన లక్ష్యాలకు మద్దతుగా మొబైల్, డివైస్ బ్యాటరీ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అమరావతిలో భాగస్వామ్యం: రాజధాని అమరావతి నిర్మాణం, పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనలో శాంసంగ్ భాగస్వామి కావాలని ఆహ్వానించారు. అమరావతి క్వాంటం వ్యాలీలో శాంసంగ్ ఆర్&డీ విభాగాన్ని నెలకొల్పాలని సూచించారు. శాంసంగ్ సిటీ: వీటన్నిటికీ మించి శాంసంగ్ బహుళ విభాగాలకు ఒకేచోట నిలయంగా ఉండేలా ఏపీలో ఒక ప్రత్యేక 'శాంసంగ్ సిటీ'ని నిర్మించాలన్న భారీ ప్రతిపాదనను కూడా లోకేశ్ వారి ముందుంచారు. మంత్రి లోకేశ్ చేసిన ఈ ప్రతిపాదనలపై శాంసంగ్ ప్రతినిధులు స్పందిస్తూ, తమ సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి నిర్ణయం వెల్లడిస్తామని తెలిపారు. మొత్తం మీద, గ్రీన్ ఎనర్జీ, హై-టెక్ తయారీ రంగాలలో కొరియా దిగ్గజాలను ఏపీకి ఆకర్షించేందుకు మంత్రి లోకేశ్ చేసిన ఈ ప్రయత్నాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ముఖ్యంగా డెల్టా ఎక్స్ నుంచి సానుకూల స్పందన రావడం రాష్ట్రానికి శుభపరిణామంగా భావిస్తున్నారు.

# భద్రాద్రి రామయ్య మీద ఒట్టు - వచ్చే ఎన్నికల్లో 117 సీట్లతో మళ్లీ మాదే అధికారం

మొదటి పేజి తరువాయి




కొందరు తనను ప్రశ్నించారని గుర్తు చేశారు. వాళ్లు ఎలా వచ్చినా కాంగ్రెస్ 65 సీట్లు గెలుస్తుందని ఆనాడే చెప్పానని, ఎన్నికల్లో తమ పార్టీకి 64 సీట్లు వచ్చాయని స్పష్టం చేశారు. ఉప ఎన్నికల్లో మరో రెండు సీట్లు వచ్చాయన్నారు. పాపాల భైరవుడిని ఫామ్‌హౌస్‌కు పరిమితం చేశాం : బీఆర్ఎస్‌కు లోక్‌సభ ఎన్నికల్లో సున్నా సీట్లు వస్తాయని చేవెళ్ల సభలో చెప్పానని, చేవెళ్ల సభలో చెప్పినట్లే బీఆర్ఎస్‌కు గుండు సున్నా సీట్లు వచ్చాయని తెలిపారు. అన్ని ఎన్నికల్లోనూ తాను చెప్పినట్లుగానే ప్రజలు తీర్పు ఇచ్చారన్న ఆయన, అన్ని ఎన్నికల్లో ఓడించి పాపాల భైరవుడిని ఫామ్‌హౌస్‌కు పరిమితం చేశామని అన్నారు. కౌరవ వంశాన్ని (కల్వకుంట్ల కుటుంబం) తెలంగాణ గడ్డ మీద నుంచి తొలగిస్తామని, కల్వకుంట్ల కుటుంబాన్ని రాజకీయంగా అణగ దొక్కేవరకు విశ్రాంతి తీసుకోనని స్పష్టం చేశారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో డీ లిమిటేషన్ బిల్లు ఆమోదించుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. వచ్చే శాసనసభ ఎన్నికలు 2028 డిసెంబర్‌లో జరగవు. 2029 మే, జూన్‌లో జరుగుతాయి. అసెంబ్లీ సీట్లు 119 నుంచి 182కు, ఎంపీ సీట్లు 17 నుంచి 26కు పెరుగుతాయి. వచ్చే ఎన్నికల్లో 117 సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తాం. 117 సీట్లు గెలుస్తామని భద్రాచలం రాముడి మీద ఆన. - రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కల్వకుంట్ల కుటుంబంలోనే కుట్రలు, కుతంత్రాలు : నాడు వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారని, నేడు వరి వస్తే కొనుగోలు చేసి బోనస్ ఇస్తున్నామని రేవంత్ రెడ్డి అన్నారు. రైతును రాజు చేయాలని మంత్రి తుమ్మల ప్రయత్నిస్తున్నారని, ప్రభుత్వం వచ్చిన రెండున్నరేళ్లలో రైతులకు రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు పెట్టామని పేర్కొన్నారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని అసత్యాలు చెప్పారని, కేసీఆర్ ఇప్పుడు కరెంట్ తీగలు పట్టుకో కాకిలా మాడిపోతావని ఎద్దేవా చేశారు. ఉచిత కరెంట్ కాంగ్రెస్ పేటెంట్ రైట్ అని వెల్లడించారు. రైతుల కళ్లలో ఆనందం చూడటమే తమ లక్ష్యమని, కల్వకుంట్ల కుటుంబంలోనే కుట్రలు, కుతంత్రాలు ఉన్నాయని, వారి కుటుంబంలో ఒకరిని చూస్తే ఒకరికి నచ్చదని విమర్శించారు. భద్రాచలం రాముడు మునగాలా? : మేడిగడ్డలో నీళ్లు నింపాలని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారని, ఒకవేళ మేడిగడ్డలో నీళ్లు నింపితే భద్రాచలం మునుగుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. రాజకీయాల కోసం భద్రాచలం రాముడు మునగాలా? అని ప్రశ్నించారు. హరీశ్‌రావు బీజేపీ నేతలతో రాత్రి మంతనాలు చేస్తున్నారని ఆరోపించిన సీఎం, బీజేపీతో మంతనాలు చేయట్లేదని హరీశ్‌రావు ప్రమాణం చేస్తారా? అని సవాల్ విసిరారు. తాటిచెట్టంత పెరిగిన ఆయనకు బుర్రలో గుజ్జు లేదని ఎద్దేవా చేశారు. "బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేస్తారని ఆయన చెల్లెలే చెబుతున్నారు. ఆంధ్రా కాంట్రాక్టర్ల నుంచి ఆయన డబ్బులు తీసుకున్నారని చెల్లెలే చెప్పారు. ప్రజలకు ఉపయోగపడే ఏ పథకాన్ని రద్దు చేయలేదు. నిరుద్యోగుల కలను కేసీఆర్ నెరవేర్చలేదు. మా ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే 67 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. ఆడబిడ్డలకు చీరల పంపిణీ చేసేందుకూ వాళ్లు కమీషన్లు తీసుకున్నారు. రాష్ట్రం అప్పుల ఊబిలో ఉన్నా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. భట్టి కోరిక మేరకు మధిరకు ఇంజినీరింగ్ కాలేజీ మంజూరు చేస్తున్నా. 20 ఎంపీ సీట్లు గెలిచి కాంగ్రెస్ అధిష్ఠానానికి బహుమతి ఇస్తాం. 5 లక్షల మందితో త్వరలో రాహుల్‌గాంధీతో ఖమ్మంలో సభ పెడతాం

# భారత తొలి హైడ్రోజన్ ట్రైన్ కు రైల్వే శాఖ ఆమోదం

మొదటి పేజి తరువాయి

రైలు ట్రయల్ రన్ పూర్తి చేశారు. ఇందులో అత్యవసర బ్రేకింగ్ దూరం, రైలు డోలనం వంటి కీలక అంశాలపై దృష్టి సారించారు. రానున్న 10 నుంచి 12 రోజుల్లో మిగిలిన అన్ని పరీక్షలు పూర్తయ్యే అవకాశం ఉందని రైల్వే వర్గాలు వెల్లడించాయి. అనంతరం రీసెర్చ్ డిజైన్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ (ఆర్డీఎస్‌వో) నుంచి తుది అనుమతి లభిస్తే, సాధారణ రైలు సేవలు ప్రారంభం కానున్నాయి. ఈ సేవలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ త్వరలోనే ప్రారంభించే అవకాశం ఉందని తెలుస్తోంది. రైల్వే మంత్రిత్వ శాఖ ప్రకారం, ఈ రైలు త్వరలో ప్రారంభం కావడానికి సిద్ధంగా ఉంది. 1200 కిలోవాట్ల ఇంజిన్ సాయంతో గంటకు 75 కిలోమీటర్ల గరిష్ట వేగంతో నడుస్తుంది. హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ ప్రొపల్షన్ సిస్టమ్ తో స్వచ్ఛమైన, మరింత శక్తి సామర్థ్యం గల రైలు రవాణాను ప్రోత్సహించడమే లక్ష్యం. హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ టెక్నాలజీ అనేది హైడ్రోజన్‌ను ఉపయోగించి రసాయన చర్య ద్వారా విద్యుత్తును ఉత్పత్తి చేస్తుంది. దీని ఫలితంగా నీటి ఆవిరి మాత్రమే ఉద్గారంగా వెలువడుతుంది. ఇది సంప్రదాయ



శిలాజ ఇంధన ఆధారిత ట్రాక్షన్ సిస్టమ్‌లకు స్వచ్ఛమైన ప్రత్యామ్నాయం అని రైల్వే శాఖ తెలిపింది. ఈ రైలు కోసం జింద్‌లో స్వదేశీ హైడ్రోజన్ నిల్వ, ఇంధనం నింపే సదుపాయాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఇక్కడ కంప్రెస్ డ్ హైడ్రోజన్ గ్యాస్ ను నిల్వ, పంపిణీ చేసేందుకు పెట్రోలియం, పేలుడు పదార్థాల భద్రతా సంస్థ (పెసో) అవసరమైన లైసెన్సును మంజూరు చేసింది.

### తక్కువ ఖర్చుతో హైడ్రోజన్ రైలు

కాగా, సాధారణంగా డీజిల్‌తో నడిచే రైళ్లు గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను విడుదల చేస్తాయి. ఫలితంగా వాయు కాలుష్యం పెరుగుతుంది. అటు ఎలక్ట్రిక్ రైళ్లు నడపాలంటే బాగా ఖర్చుతో కూడుకున్న విషయం. ముఖ్యంగా ఓవర్‌హెడ్ లైన్ మౌలిక సదుపాయాలు అవసరం. అయితే, తక్కువ ఖర్చుతోనే హైడ్రోజన్ రైలును నడపొచ్చు. అలాగే ఇది కాలుష్య కారకాలను ఉత్పత్తి చేయదు. ఫలితంగా పర్యావరణానికి కూడా ఎలాంటి హాని ఉండదు. అంతే కాకుండా ఈ హైడ్రోజన్ రైలు డీజిల్ ఇంజిన్ల లాగా భారీ శబ్దాలు చేయకుండా చాలా నిశబ్దంగా వెళ్లిపోతుంది.

అధునాతన ఫీచర్లు

ఇదిలా ఉండగా, హైడ్రోజన్ రైలు బోగీలను చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్)లో తయారు చేశారు. బ్రాడ్ గేజ్ ప్లాట్‌ఫామ్‌పై ఉన్న ప్రపంచంలోనే అతి పొడవైన రైలు (10 కోచ్‌లు) ఇదే కానుంది. అలాగే అత్యంత శక్తివంతమైన (2400 ఎవా) హైడ్రోజన్ రైలు కూడా ఇదే అవ్వనుంది. దీనికి రెండు 1200 ఎవా డ్రైవింగ్ పవర్ కార్లు (డీపీసీలు) ఉన్నాయి. అంటే ఒకటి ఇంజిన్ ముందు భాగంలో, మరొకటి వెనుక భాగంలో అమర్చి ఉంటుంది. ఇందులో ఎనిమిది ప్యాసింజర్ కార్లు కూడా ఉన్నాయి. అలాగే హైడ్రోజన్ రైలు సౌకర్యాల పరంగా కూడా చాలా అధునాతనంగా ఉంటుంది. దీనికి ఆటోమేటిక్ డోర్లు, డిజిటల్ డిస్‌ప్లేలు ఉంటాయి. ఇంటీరియర్ డిజైన్ కూడా చాలా ప్రత్యేకంగా ఉంటుంది.

# సింగరేణి గనుల్లో భద్రతపై రాజీ లేదు: డైరెక్టర్ కె. వెంకటేశ్వర్లు






మందమర్రి,: మందమర్రి పట్టణంలోని ఇల్లందు క్లబ్‌లో శుక్రవారం బెల్లంపల్లి, మందమర్రి ఏరియాల 24వ త్రైపాక్షిక వార్షిక భద్రతా సమీక్షా సమావేశం ఘనంగా నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) కె. వెంకటేశ్వర్లు, డీజీఎంఎస్ అధికారులతో కలిసి మొక్కలు నాటి, జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా డీఎంఎస్ (మైనింగ్) సాగేష్ కుమార్ మాట్లాడుతూ గనుల్లో ప్రతి ఉద్యోగి రక్షణ సూత్రాలను తప్పనిసరిగా పాటిస్తూ విధులు నిర్వర్తించాలని సూచించారు. మందమర్రి ఏరియాలో ప్రమాదాల శాతాన్ని సున్నాకు చేర్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, భూగర్భ, ఓపెన్‌కాస్ట్ గనుల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు కీలక ప్రాంతాల్లో అనుభవజ్ఞులైన ఉద్యోగులను నియమించాలని సూచించారు. కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు.సింగరేణి డైరెక్టర్ కె. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రక్షణ చర్యల విషయంలో యాజమాన్యం ఎలాంటి రాజీ పడబోదని స్పష్టం చేశారు. ఉద్యోగులు, అధికారులు సమన్వయంతో రక్షణ నియమాలను పాటిస్తూ ఉత్పత్తి లక్ష్యాలను విజయవంతంగా సాధిస్తున్నారని తెలిపారు.కార్పొరేట్ సేఫ్టీ జనరల్ మేనేజర్ సాయిబాబు మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా ఉద్యోగులకు భద్రతపై నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రతి గనిలో సేఫ్టీ ఆపరేటింగ్ ప్రొసీజర్స్‌ను ప్రతి ఉద్యోగికి తెలిసేలా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు గనుల్లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక యంత్రాలను వినియోగించి భద్రతను మరింత మెరుగుపరచాలని యాజమాన్యానికి సూచించారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందిస్తూ కార్మిక సంఘాల సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు. అంతకుముందు డీజీఎంఎస్, సింగరేణి గీతాల ప్రదర్శన అనంతరం రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. గని ప్రమాదాల్లో మృతిచెందిన కార్మికులకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో డీడీఎంఎస్ (మైనింగ్) దీపక్ కుమార్ ప్రభాకర్, డీడీఎంఎస్ (ఎలక్ట్రికల్) కోమల్ చౌదరి, మందమర్రి జీఎం ఎన్. రాధాకృష్ణ, బెల్లంపల్లి జీఎం ఎం. శ్రీరమేష్, ఏఐటీయూసీ నాయకులు సలేంద్ర సత్యనారాయణ, ఎస్. తిరుపతి, బెల్లంపల్లి రీజియన్ జీఎం (సేఫ్టీ) రఘుకుమార్, జీఎం (రెస్క్యూ) శ్రీనివాస్ రెడ్డి, సీఎంఓఏఐ ప్రతినిధులు, గని మేనేజర్లు, సేఫ్టీ అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జల్.. జంగిల్.. జమీన్ కోసం

# మరోసారి గిరిజనుల స్వరం..!

### కొమురం భీం జిల్లాలో పోడు భూముల సమస్యపై పెరుగుతున్న ఆందోళన




కొమురం భీం జిల్లా: : జల్.. జంగిల్.. జమీన్ నినాదంతో చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన వీరుడు కొమురం భీం పోరాడిన నేల నేడు మరోసారి పోడు భూముల సమస్యతో వార్తల్లో నిలుస్తోంది. గిరిజనుల జీవనాధారమైన పోడు భూములపై వివాదాలు రోజురోజుకూ పెరుగుతుండటంతో జిల్లా వ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతోంది. కొమురం భీం జిల్లాలో అధిక శాతం గిరిజన కుటుంబాలు అడవిపైనే, పోడు సాగుపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. తరతరాలుగా సాగు చేస్తున్న భూములే తమకు అన్నం పెడుతున్నాయని, వాటిపై హక్కులు కల్పించాలని గిరిజనులు చాలా కాలంగా కోరుతున్నారు. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా తమ సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే నాయకులు గ్రామాలకు వస్తారని, ఆ తర్వాత తమ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. జిల్లాలోని పలు మండలాల్లో పోడు భూముల అంశంపై అటవీ శాఖ అధికారులు, గిరిజనుల మధ్య తరచూ ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయి. దశాబ్దాలుగా సాగు చేస్తున్న భూములను కోల్పోతామనే భయంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, సాగు చేస్తున్న భూములపై చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని గిరిజనులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గిరిజనుల జీవన హక్కులు, అటవీ సంరక్షణ రెండింటినీ సమన్వయం చేస్తూ ప్రభుత్వం ముందుకు రావాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# అకస్మాత్తుగా హోల్డ్‌లోకి బ్యాంక్ ఖాతాలు.. లబోదిబోమంటున్న సామాన్యులు

### నోటీసులు లేవు.. ముందస్తు సమాచారం లేదు:
### సామాన్యుల బ్యాంక్ అకౌంట్లకు 'ఫ్రీజ్' !
### ఖాతాలో డబ్బులున్నా చేతిలో పైసా లేదు..
### నిత్యావసరాలకు సామాన్యుల తంటాలు




మంచిర్యాల్ (బైరి రవీందర్), : కూలీ నాలీ చేసుకునే పేదవాడి అకౌంట్‌లో లక్షలు ఉంటాయా? కోట్లు ఉంటాయా? కష్టపడి దాచుకున్న నాలుగు పైసలే ఆ కుటుంబానికి కొండంత అండ.కానీ,ఇప్పుడు ఆ పేదోడి జేబుకే చిల్లు పడుతోంది.అకౌంట్లో డబ్బులు ఉన్నా తీయలేని పరిస్థితి.. అత్యవసరానికి రూపాయి విత్‌డ్రా చేసుకోలేక,ఆన్‌లైన్ లావాదేవీలు కాక సామాన్యులు రోడ్డున పడుతున్నారు.తీరా బ్యాంకుకెళ్లి అడిగితే.. "మీ అకౌంట్లో ఫ్రాడ్ మనీ పడింది.. సైబర్ క్రైమ్ పోలీసులు అకౌంట్ ఫ్రీజ్ చేశారు" అని బోర్డు తిప్పేస్తున్నారు. అసలు ఎందుకు ఇలా జరుగుతోంది? సామాన్యులు ఎందుకు బలిపశువులు అవుతున్నారు?

#### సాయం చేయబోతే.. సంకెళ్లు!

ఈ రోజుల్లో రోడ్డు పక్కన కాయగూరలు అమ్మే వ్యక్తి నుంచి కిరాణా షాప్ దాకా అంతా ఆన్‌లైన్ పేమెంట్లే.అయితే, కొందరు సైబర్ నేరగాళ్లు అమాయకులను టార్గెట్ చేస్తున్నారు. "అయ్యా.. మాకు అర్జెంట్‌గా క్యాష్ కావాలి, మీ నంబర్‌కు ఫోన్ పే లేదా గూగుల్ పే చేస్తాం..మాకు చేతికి నగదు ఇవ్వండి" అని అడుగుతుంటారు. తెలిసినవాడే కదా అని లేదా పాపం అని సాయం చేస్తే..అది కాస్తా మీ అకౌంట్‌ను లాక్ చేసే వరకు వెళ్తుంది.సైబర్ కేటుగాళ్లు ఎక్కడో ఒకరిని మోసం చేసి దండుకున్న డబ్బును (ఫ్రాడ్ మనీ), ట్రాక్ దొరకకుండా ఉండటం కోసం ఇలాంటి అమాయకుల అకౌంట్లలోకి మళ్లిస్తున్నారు.సైబర్ పోలీసులు ఆ ఫ్రాడ్ లింక్‌ను ట్రాక్ చేసుకుంటూ వెళ్తే.. చివరకు సాయం చేసిన అమాయకుడి అకౌంట్ దొరుకుతుంది.దాంతో లూప్ లో ఉన్న అన్ని అకౌంట్లను పోలీసులు హోల్డ్‌లో పెడుతున్నారు.

#### దేశం కాని దేశం.. ఎక్కడికెళ్లాలి?

అకౌంట్ ఫ్రీజ్ అయితే పోనీ లోకల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్దామా అంటే..అక్కడ సమస్య పరిష్కారం కాదు. ఈ సైబర్ కేసులు ఎక్కడో బీహార్,రాజస్థాన్,ఢిల్లీ లేదా పశ్చిమ బెంగాల్ వంటి ఇతర రాష్ట్రాల్లో నమోదై ఉంటాయి. అక్కడికి వెళ్లలేక, ఏం చేయాలో తెలియక, లాయర్లను పెట్టుకునే స్తోమత లేక ఎంతోమంది పేదలు, మధ్యతరగతి ప్రజలు లబోదిబోమంటున్నారు.

#### అకౌంట్ ఎందుకు ఫ్రీజ్ అవుతుంది?

మీ అకౌంట్ లోకి వచ్చిన డబ్బు ఏదైనా సైబర్ నేరంతో ముడిపడి ఉండటం. కమిషన్ ఆశ చూపడం.కొందరు కేటుగాళ్లు పార్ట్ టైమ్ జాబ్స్ పేరిట కమిషన్ ఇస్తామని చెప్పి, అమాయకుల అకౌంట్లను మనీ లాండరింగ్‌కు వాడుకుంటున్నారు.బ్యాంకు నిబంధనల ప్రకారం కేవైసీ అప్‌డేట్ చేయకపోవడం.

#### అకౌంట్ ఫ్రీజ్ అయితే ఏం చేయాలి ?

భయపడకండి.. ఇలా చేయండి.మొదట కంగారు పడకుండా మీ హోమ్ బ్రాంచ్‌కు వెళ్లండి.మీ అకౌంట్ ఎందుకు ఫ్రీజ్ అయింది? ఏ రాష్ట్ర సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ నుంచి ఆర్డర్ వచ్చింది? వారి మెయిల్ ఐడీ, కంప్లైంట్ నంబర్ ఏంటి అనేది లిఖితపూర్వకంగా అడిగి తీసుకోండి. ఇతర రాష్ట్రాలకు నేరుగా వెళ్లడం కష్టం కాబట్టి,సంబంధిత సైబర్ క్రైమ్ పోలీసుల మెయిల్ ఐడీకి మీ వివరాలను పంపాలి. మీరు ఏ తప్పు చేయలేదని,కేవలం సాయం చేయడం వల్ల లేదా వ్యాపార లావాదేవీల వల్ల ఆ డబ్బు వచ్చిందని నిరూపించే ఆధారాలు మెయిల్ చేయాలి. ఈ విషయంలో సహాయం కోసం కేంద్ర ప్రభుత్వ సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 ని సంప్రదించవచ్చు లేదా ఏఎఎవతీ-ఎతీఅఎవ.స్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

#### ప్రజలు వహించాల్సిన జాగ్రత్తలు:

తెలియని వారి నుంచి డబ్బులు వద్దు. రోడ్డు మీద ఎవరో తెలియని వ్యక్తి అర్జెంట్ అని మీ అకౌంట్ లోకి డబ్బులు పంపుతామంటే ఎట్టిపరిస్థితుల్లో ఒప్పుకోవద్దు. కమిషన్ ఆశలకు దూరంగా ఉండండి. మీ అకౌంట్ ద్వారా ఇతరుల డబ్బులు పంపిస్తే కమిషన్ ఇస్తామనే మోసపూరిత మాటలు నమ్మకండి. మీ బ్యాంక్ అకౌంట్ నంబర్, ఓటీపీ, ఎటిఎం,పిన్,వంటి గోప్యమైన సమాచారాన్ని ఎవరికీ చెప్పకండి.సాంకేతికత పెరిగేకొద్దీ సౌకర్యాలతో పాటు ముప్పు కూడా పెరుగుతోంది. ఒక్క క్షణం అజాగ్రత్తగా ఉన్నా,అనవసరపు సాయానికి పోయి చిక్కుల్లో పడక తప్పదు. సైబర్ నేరాల పట్ల "అవగాహనే శ్రీరామరక్ష".

## లక్ష్మీబాయి కుటుంబాన్ని పరామర్శించిన ఆత్రం సుగుణక్క



ఆసిఫాబాద్:: ఆసిఫాబాద్ పట్టణానికి చెందిన వరముని లక్ష్మీబాయి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క శుక్రవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా లక్ష్మీబాయి చిత్రపటానికి నివాళులర్పించి, ఆమె మృతిపట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. దివంగత లక్ష్మీబాయి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.సుగుణక్క వెంట డీసీసీ ప్రధాన కార్యదర్శి గాదెవేణి మల్లేష్, మాజీ ఎంపీటీసీ సిడాం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి



వాస్తవ గమ్యం : బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరం కార్పొరేట్ వైద్యులచే ఏర్పాటు చేయాలని టిబిజి కేఎస్ వైస్ ప్రెసిడెంట్ శ్రీ మల్ రాజ్ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రిని శుక్రవారం ఎదీ+ఖూ నాయకులతో కలిసి సందర్శించిన ఆయన మాట్లాడుతూ గోదావరిఖని మరియు రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రిలలో నిర్వహించినట్టుగా హైదరాబాద్ కు చెందిన సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరం బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రిలో కూడా ఏర్పాటు చేయాలని బెల్లంపల్లి మరియు చుట్టుపక్కల ఉన్న సింగరేణి ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు అలాగే మాజీ కార్మికులకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఎంతైనా అవసరం ఉందని అన్నారు. అలాగే బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రిలో ప్రతి వారం రావలసిన స్పెషలిస్ట్ డాక్టర్లు ఈ మధ్యకాలంలో సరిగా రావడం లేదని అన్ని రకాల సూపర్ స్పెషలిస్ట్ డాక్టర్లు ప్రతి వారం వచ్చే విధంగా చూడాలని హాస్పిటల్స్ సూపరిండెంట్ మరియు బెల్లంపల్లి జనరల్ మేనేజర్ గారిని డిమాండ్ చేశారు . అలాగే బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రిలో డాక్టర్ల కొరత స్టాఫ్ నర్స్ ల కొరత ఫార్మసిస్టుల కొరత ల్యాబ్ టెక్నీషియన్ ఎక్రే ప్లాంట్ ఆపరేటర్ల కొరత ఉన్నదని సింగరేణిలో నోటిఫికేషన్ జారీ చేసి అన్ని రకాల పారామెడికల్ సిబ్బంది నియామకం చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మికుల 12వ వేజ్ బోర్డు జూలై 1వ తేదీన ప్రారంభమైనప్పటికీ జేబీసీసీఐ కమిటీ వేయలేదని జాతీయ సంఘాలు కనీస ఉమ్మడి డిమాండ్ నోటీసు ఇవ్వలేదని ఇప్పటికైనా వెంటనే జబీసీసీఐ కమిటీ ఏర్పాటు చేసి వేతన ఒప్పందాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ సెంట్రల్ నాయకులు అనుముల సత్యనారాయణ ఓరం కిరణ్ ఏరియా కార్యదర్శి మారిన వెంకటేష్ సంఘీ ప్రశాంత్ సిహెచ్పి పిట్ కార్యదర్శి మెరుగు రమేష్ అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి మర్రి సమ్మయ్య నాయకులు రాజు భోగి శ్రీనివాస్, రావుఫ్ తదితరులు పాల్గొన్నారు

## జెనసేన లోకి మున్నూరు కాపు ప్రముఖ వైద్యులు.



హైదరాబాద్/కరీంనగర్:: ప్రముఖ వైద్యులు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన డా రాజ్‌కుమార్ మరియు డా. కృష్ణ ప్రియ జనసేన పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై, పార్టీ అధ్యక్షులు మరియు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ సమక్షంలో హైదరాబాద్‌లో అధికారికంగా జనసేన తెలంగాణలో చేరారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ వారికి జనసేన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, "రాజకీయాల్లో మేధావులు, వైద్యులు, యువత ముందుకు రావడం సమాజానికి ఎంతో అవసరం. విలువలతో కూడిన, పారదర్శకమైన పాలన కోసం సేవాభావం ఉన్న ప్రతి ఒక్కరూ రాజకీయాల్లో భాగస్వాములు కావాలి. అలాంటి వ్యక్తులు జనసేనలో చేరడం పార్టీకి బలాన్ని చేకూరుస్తుంది" అని పేర్కొన్నారు. తెలంగాణలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన వారికి సూచించారు.

## భూముల రీసర్వే పక్కాగా చేపట్టాలి

### నక్షాలు లేని గ్రామాలను గుర్తించి రీసర్వే చేయాలని కలెక్టర్ ఆదేశం



ఆసిఫాబాద్ : కొమరం భీం ఆసిఫాబాద్, జూలై 10: జిల్లాలోని రెవెన్యూ నక్షాలు లేని గ్రామాలను గుర్తించి భూముల రీసర్వే చేపట్టి కొత్తగా గ్రామ నక్షాలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లోని రెడ్డి భవన సమావేశ మందిరంలో భూముల రీసర్వేపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, ఆసిఫాబాద్ రెవెన్యూ మండల అధికారి లోకేశ్వర్‌రావు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ వినయ్‌తో పాటు సర్వే శాఖ అధికారులు పాల్గొన్నారు.జిల్లాలో రెవెన్యూ నక్షాలు లేని గ్రామాలను ఇప్పటికే గుర్తించారు. భూముల రీసర్వే వల్ల రైతులకు మేలు జరగడంతో పాటు భవిష్యత్తులో భూ వివాదాలకు ఆస్కారం ఉండదని కలెక్టర్ వివరించారు. సర్వే నిర్వహణకు ముందు గ్రామసభలు ఏర్పాటు చేసి రైతులతో సమావేశం కావాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా సర్వే పనులను పక్కాగా పూర్తి చేయాలని, అందుకు అవసరమైన పరికరాలను ముందుగానే సమకూర్చుకోవాలని అధికారులను ఆదేశించారు.

## సీపీఐ మందమర్రి మండల నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



మందమర్రి : సీపీఐ మందమర్రి మండల నూతన కమిటీని శుక్రవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన మండల సమితి సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా సమితి సభ్యులు కాదండి సాంబయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి సీపీఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ నిర్మాణం, ప్రజా ఉద్యమాల బలోపేతంపై దిశానిర్దేశం చేశారు.సమావేశంలో 13 మంది సభ్యులతో కూడిన మండల కార్యవర్గం, 21 మంది సభ్యులతో కూడిన మండల కౌన్సిల్‌ను ఏకగ్రీవంగా ఆమోదించి నూతన మండల కమిటీని ప్రకటించారు. మండల కార్యదర్శిగా వనం సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా తాళ్లపల్లి వీరయ్య, కోశాధికారిగా బండారి రాజేశం, మండల ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రోడ్డ నరేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా రామడుగు లక్ష్మణ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరిస్తూ పోరాటాలను మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, యువత, మహిళల సమస్యల పరిష్కారానికి సీపీఐ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. నూతన కమిటీ సభ్యులు పార్టీ సిద్ధాంతాలను గ్రామ గ్రామానికి తీసుకెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఇప్పకాయల లింగయ్య, జిల్లా సమితి సభ్యులు మిట్టపల్లి పౌలు, నక్క వెంకట్‌స్వామి, మామిడి గోపి, మహిళా నాయకురాలు రోడ్డ తిరుమలతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించాలి


### టిడబ్ల్యూజేఎఫ్



ఆసిఫాబాద్ : కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందిన జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) ప్రభుత్వాన్ని, ఆర్టీసీ యాజమాన్యాన్ని కోరింది. రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య ఆదేశాల మేరకు జిల్లా శాఖ నాయకులు కాగజ్‌నగర్ ఆర్టీసీ కంట్రోలర్ లక్ష్మణ్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ వార్తల సేకరణ కోసం నిత్యం రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణిస్తుంటారని, ప్రస్తుతం ఉన్న రాయితీ విధానంతోనూ దాదాపు 50 శాతం వరకు చార్జీలు చెల్లించాల్సి వస్తోందని తెలిపారు. తక్కువ వేతనాలతో పనిచేస్తున్న విలేకరులపై ఇది అదనపు భారం అవుతోందని పేర్కొన్నారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్న తరహాలోనే జర్నలిస్టులకూ అన్ని ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు వడ్నాల వెంకన్న, జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఈర్ల సునీల్ కుమార్, సంయుక్త కార్యదర్శి కడారి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు.

## సీఎం సహాయనిధి చెక్కులు అందజేసిన శ్యాంనాయక్

### ఇద్దరు లబ్ధిదారులకు రూ.1,82,500 ఆర్థిక సాయం



ఆసిఫాబాద్ : ఆసిఫాబాద్ నియోజకవర్గం వాంకిడి గ్రామానికి చెందిన రుక్మాబాయి, అజయ్, రెబ్బెనకు చెందిన ఎస్.లక్ష్మికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీర శ్యాంనాయక్ శుక్రవారం క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. అనారోగ్యంతో గతంలో చికిత్స పొందిన వీరు ఆర్థిక సహాయం కోసం శ్యాంనాయక్‌ను సంప్రదించగా, వారి పరిస్థితిని పరిశీలించి మెడికల్ బిల్లులతో ముఖ్యమంత్రి సహాయనిధికి సిఫారసు చేశారు. దీంతో లబ్ధిదారులకు మొత్తం రూ.1,82,500 విలువైన చెక్కులు మంజూరయ్యాయి.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మంగ, వైస్ చైర్మన్ రవీందర్, డైరెక్టర్ విశ్వనాథ్, నిజాం, మారుతి పటేల్, కౌన్సిలర్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆసిఫాబాద్ ఆసుపత్రికి అదనంగా 5 డయాలసిస్ మిషన్లు

### శ్యాంనాయక్ చొరవతో సమస్యకు పరిష్కారం



ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ రోగుల సమస్య పరిష్కారమైంది. ఇక్కడ ఇప్పటివరకు 5 డయాలసిస్ మిషన్లు మాత్రమే ఉండటంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని వైద్యులు, స్థానిక నాయకులు నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీర శ్యాంనాయక్ దృష్టికి తీసుకెళ్లారు.దీనిపై స్పందించిన శ్యాంనాయక్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి రాజనర్సింహలను కలిసి అదనంగా 5 డయాలసిస్ మిషన్లు కేటాయించాలని కోరారు. మంత్రులు వెంటనే మిషన్లు మంజూరు చేశారు. శుక్రవారం శ్యాంనాయక్ ఆసుపత్రికి వెళ్లి డయాలసిస్ విభాగాన్ని పరిశీలించారు. పేదల వైద్యానికి సహకరించిన మంత్రులకు నియోజకవర్గ ప్రజలతో పాటు శ్యాంనాయక్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ



జైపూర్,: మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో శుక్రవారం ఎంపియుపిఎస్ పాఠశాల విద్యార్థులకు సోనీ జ్యువెలర్స్ యజమాన్యం హరికిషన్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆపరేటర్ హెడ్ ప్రేమ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేయడం తమ యాజమాన్యానికి ఎంతో ఆనందకరంగా ఉందని, పిల్లలు ఆడుతూ పాడుతూ ఆనందంగా ఇష్టంగా విద్యను అభ్యసించాలని కోరారు.క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరుకావాలని,ఉపాధ్యాయుల శిక్షణ లో శ్రద్ధతో చదువుకుని చక్కని భవిష్యత్తు నిర్మించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అడ్మిన్ మహేష్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గంజాయి వంటి మత్తు పదార్థాలకు

# దూరంగా ఉండాలి. సిఐ సంజయ్



రెబ్బన : కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితిక పంత్ ఆదేశాల మేరకు విసిబుల్ పోలీసింగ్ లో భాగంగా రెబ్బెన మండలం గోలేటి గ్రామంలో రెబ్బెన సర్కిల్ జ× సంజయ్ ఆధ్వర్యంలో రెబ్బెన ాఱ వెంకటకృష్ణ ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ప్రజల లో మాదక ద్రవ్యాల నియంత్రణ లో భాగం గా ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించినట్లు సిఐ సంజయ్ తెలిపినారు, గ్రామల లో గంజాయి అమ్మిన, త్రాగిన కేసులు నమోదు చేస్తామని తెలియ జేసినారు గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలీ అని మాదక ద్రవ్యాల నియంత్రణ లో ప్రజలు భాగస్వామ్యం కావాలని, పిలుపునిచ్చారు గంజాయి కి సంబంధించిన ఎలాంటి సంచారం ఉన్నా తెలియజేయాలని చెప్పిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు. లేని యెడల ఈగల్ ఫోర్స్ కి సమాచారం ఇవ్వాలని 1908 సూచించడం అయినది వీటిలో భాగం గా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, సైబర్ క్రైమ్ గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమం లో రెబ్బెన ాఱ వెంకటకృష్ణ మరియు సిబ్బంది పాల్గొనారు.

# తమన్నా ఫైన్ జ్యువెలరీ మ్యాజిక్.. లగ్జరీ లుక్‌లో మిల్కీ బ్యూటీ రచ్చ!



మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా కేవలం సినిమాలతోనే కాకుండా బిజినెస్ ఉమన్‌గానూ దూసుకుపోతోంది. తాజాగా ఆమె తన సొంత బ్రాండ్ 'తమన్నా ఫైన్ జ్యువెలరీ' ప్రమోషన్స్ కోసం చేసిన రాయల్ ఫోటోషూట్ సోషల్ మీడియాను ఊపేస్తోంది. "రేపటి రూపాన్ని మార్చడానికి, ఇవాళ ఎన్నో విప్లవాత్మక మార్పులు కావాలి" అంటూ క్రేజీ క్యాప్షన్‌తో ఆమె షేర్ చేసిన లుక్ అదిరిపోయింది. ఇక పెరల్స్, డైమండ్స్ కలబోసిన నగలు ధరించి, క్లాసీ అండ్ మోడ్రన్ ఔట్‌ఫిట్‌లో తమన్నా ఇచ్చిన పోజులు ఫ్యాన్స్‌ను ఫిదా చేస్తున్నాయి.

**ముత్యాలు, వజ్రాల కలబోతగా లగ్జరీ లుక్:**

తమన్నా తన లేటెస్ట్ జ్యువెలరీ క్యాంపెయిన్ కోసం ముత్యాలు, వజ్రాల కాంబినేషన్‌లో అద్భుతమైన డిజైన్లను ధరించింది. స్నో అండ్ గోల్డ్ టోన్స్ లో ఉన్న స్టాకబుల్ బ్యాండ్స్, లేయర్డ్ నెక్లెస్, స్టేట్‌మెంట్ ఇయర్ రింగ్స్‌తో ఆమె లుక్ చాలా రిచ్‌గా అనిపించింది. ఆధునిక కాలంలో ప్రతిరోజూ ధరించేలా, ఎంతో వర్సటైల్‌గా ఉండేలా ఈ నగలను తమన్నా డిజైన్ చేయించడం విశేషం.

**అవుట్‌ఫిట్ అదుర్స్.. సింపుల్ అండ్ క్లాస్:**


ఈ ఫోటోషూట్‌లో తమన్నా వేసుకున్న డ్రెస్ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. న్యూట్రల్ కలర్‌లో ఉన్న ప్రీమియం రిబ్బెడ్ క్నిట్ వేర్ కో ఆర్డ్ సెట్‌లో ఆమె మెరిసిపోయింది. ఇక స్లీవ్‌లెస్ హాల్టర్ స్టైల్ టాప్, దానికి మ్యాచింగ్‌గా ఉన్న హై-వేస్టెడ్ వైడ్-లెగ్ ట్రౌజర్స్ ఆమెకు పర్ఫెక్ట్ లుక్ ఇచ్చాయి. నగలలోని మెరుపులు స్పష్టంగా కనిపించేలా, ఎలాంటి హంగులు లేకుండా సింపుల్‌గా ఉండేలా ఈ మెటీరియల్‌ను ఎంచుకున్నారు.

**బాలీవుడ్‌లో విజువల్ వండర్ 'వ్వాన్':**

ఇక సినిమాల విషయానికి వస్తే.. తమన్నా బాలీవుడ్‌లో ఒక భారీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సిద్ధార్థ్ మల్హోత్రా, తమన్నా లీడ్ రోల్స్ లో దీపక్ కుమార్ మిశ్రా దర్శకత్వంలో తెరకెక్కుతున్న విజువల్ వండర్ మూవీ 'వ్వాన్' ఈ సినిమాను ఈ ఏడాది సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయబోతున్నట్లు ప్రముఖ ట్రేడ్ అనలిస్ట్ తరణ్ ఆదర్శ్ అధికారికంగా ట్వీట్ చేశారు.

**హిందీ ఇండస్ట్రీపైనే తమన్నా భారీ ఆశలు:**

ఇటీవలి కాలంలో సౌత్ లో అగ్ర హీరోల సరసన అవకాశాలు కొద్దిగా తగ్గడంతో తమన్నా తన బాలీవుడ్ జర్నీపైనే పూర్తి ఫోకస్ పెట్టింది. ఇక ఇప్పటికే పలు క్రేజీ హిందీ సినిమాలు, విభిన్నమైన వెబ్ సిరీస్‌లతో అక్కడి ఆడియన్స్‌కు బాగా దగ్గరైంది. ఇప్పుడు రాబోతున్న 'వ్వాన్' చిత్రంతో బాలీవుడ్‌లో ఒక సాలిడ్ సక్సెస్ అందుకొని, తన రేంజ్‌ను మరికొంత పెంచుకోవాలని మిల్కీ బ్యూటీ గట్టి ప్లాన్‌తో ఉంది. ఒకవైపు నటిగా క్రేజీ సినిమాల్లో నటిస్తూనే, మరోవైపు 'తమన్నా ఫైన్ జ్యువెలరీ'తో బిజినెస్‌లోనూ సత్తా చాటుతోంది ఈ బ్యూటీ. ఫ్యాషన్ ప్రపంచంలో లగ్జరీ, స్టైల్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారిన తమన్నా.. అటు బిజినెస్‌లో, ఇటు సెప్టెంబర్ 25న రాబోతున్న 'వ్వాన్' సినిమాతో బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి వండర్స్ క్రియేట్ చేస్తుందో చూడాలి.



# కోట తర్వాత ఆ స్థాయి నటుడు ఎందుకు రాలేదు?



తెలుగు సినీ చరిత్రలో కొందరి స్థానాల్ని ఎవరూ భర్తీ చేయలేరు. నటులు మారతారు, తరాలు మారతాయి, కథల తీరు మారుతుంది. కానీ కొందరు నటులు సృష్టించిన చరిత్రను మాత్రం ఎవరూ అందుకోలేరు. అలాంటి అరుదైన నటుల్లో కోట శ్రీనివాసరావు పేరు ముందువరుసలో ఉంటుంది. ఆయన జయంతి సందర్భంగా మరోసారి వినిపిస్తున్న ప్రశ్న ఒక్కటే.. కోట తర్వాత ఆ స్థాయి విలక్షణ నటుడు టాలీవుడ్ లో ఎందుకు కనిపించలేదు? అని. కోట శ్రీనివాసరావును కేవలం విలన్‌గా లేదా క్యారెక్టర్ ఆర్టిస్టుగా నిర్వచించడం ఆయన టాలెంట్ ను చిన్నబుచ్చినట్లే అవుతుంది. ఒకే నటుడు ఒక సినిమాలో ఆడియన్స్ ను నవ్వించగలడు, మరో సినిమాలో భయపెట్టగలడు, ఇంకో సినిమాలో కంటతడి పెట్టించగలడు. ఈ రేంజ్ డిఫరెన్స్ నటుల్లో చాలా అరుదుగా కనిపిస్తుంది. సినిమాలో క్యారెక్టర్ ఎంత పెద్దదనేది కాదు, ఆ క్యారెక్టర్ ను ఎంత బలంగా ప్రేక్షకుల మనసుల్లో నిలిపారనేదే కోట స్పెషాలిటీ. నేటి సినిమాలను పరిశీలిస్తే టెక్నాలజీ ఎంతో డెవలప్ అయింది. భారీ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, స్టైలిష్ మేకింగ్, విజువల్ ఎలివేషన్లు క్యారెక్టర్లను ఎంతో పవర్‌ఫుల్ గా చూపిస్తున్నాయి. అయితే ఒకప్పుడు ఇవేవీ లేకుండానే కేవలం హావభావాలు, డైలాగ్ డెలివరీ, కళ్లలో కనిపించే ఇంటెన్సిటీతోనే సీన్ ను నిలబెట్టిన నటులు ఉండేవారు. ఆ లిస్ట్ లో కోట శ్రీనివాసరావు అగ్రస్థానంలో నిలిచారు. ఆయన స్క్రీన్ పై కనిపిస్తే స్పెషల్ గా ఎలాంటి ఎలివేషన్ అవసరం ఉండేది కాదు. అతని క్యారెక్టరే ఆడియన్స్ ను ఆకట్టుకునేది. ఇప్పటి నటులు కోట నుంచి నేర్చుకోవాల్సిన పెద్ద పాఠం కూడా ఇదే. ప్రతి పాత్రకు ఒకే తరహా బాడీ లాంగ్వేజ్ కాకుండా, పాత్ర స్వభావానికి తగ్గట్టుగా తన నడక, మాట, వాయిస్, ఫేస్ ఎక్స్‌ప్రెషన్స్ ను మార్చుకునే సామర్థ్యం ఆయన సొంతం. అందుకే ఆయన పోషించిన పాత్రలు ఒకదానితో మరొకటి పోలి ఉండవు. ప్రతి సినిమా చూసినప్పుడు కొత్త వ్యక్తిని చూస్తున్న భావన కలిగించగలిగారు. అంతేకాదు, ఎన్నో సినిమాల్లో ఆయన పోషించిన పాత్రలు హీరోతో సమానంగా గుర్తుండిపోయాయి. కొన్ని సందర్భాల్లో ఆడియన్స్ థియేటర్ నుంచి బయటకు వచ్చిన తర్వాత హీరో కంటే కోట చేసిన సీన్స్ గురించే ఎక్కువగా మాట్లాడుకునేవారు. కథలో పాత్ర నిడివి ఎంత ఉందన్నది కాదు, ఆ కొద్ది నిమిషాల్లో ఎంత ఇంపాక్ట్ చూపించారనేదానికి ఆయన ఎన్నో ఉదాహరణలు సృష్టించారు. అదే ఒక గొప్ప నటుడి అసలైన సక్సెస్‌గా సినీ విశ్లేషకులు భావిస్తుంటారు. టాలీవుడ్ లో ఇప్పటికీ టాలెంటెడ్ క్యారెక్టర్ ఆర్టిస్టులు ఉన్నప్పటికీ, కోట స్థాయిలో విలన్, కామెడీ, ఎమోషన్, పొలిటీషియన్, కుటుంబ పెద్ద, స్వార్థపరుడు, అమాయకుడు వంటి పూర్తిగా భిన్నమైన పాత్రలను ఒకే స్థాయిలో మోసే నటుడు కనిపించడం లేదనే అభిప్రాయం సినీ వర్గాల్లో తరచూ వినిపిస్తుంది. అందుకే కోట తర్వాత వచ్చిన ప్రతి తరాన్ని ఆయనతో పోల్చే పరిస్థితి ఇప్పటికీ కొనసాగుతోంది. అయితే ఒక నటుడి గొప్పతనం ఆయన అందుకున్న అవార్డులతో మాత్రమే కొలవలేం. దశాబ్దాలు గడిచినా ఆయన పాత్రలు ప్రేక్షకుల జ్ఞాపకాలలో సజీవంగా ఉండటం, కొత్త తరానికి కూడా అవే సీన్స్ ఆసక్తిని కలిగించడం నిజమైన గుర్తింపుగా చెప్పుకోవచ్చు. అదే కారణంగా కోట శ్రీనివాసరావు పేరు టాలీవుడ్ హిస్టరీలో ఒక నటుడిగా మాత్రమే కాదు, నటనకు ఓ ప్రమాణంగా చిరస్థాయిగా నిలిచిపోతుంది.


# అక్కినేని ఫ్యాన్స్‌ను సర్‌ప్రైజ్ చేసిన సమంత





అఖిల్ అక్కినేని హీరోగా తెరకెక్కిన లెనిన్ ప్రేక్షకుల ముందుకు వచ్చిన సందర్భంగా సినీ పరిశ్రమ నుంచి ఆయనకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో అక్కినేని మాజీ కోడలు, స్టార్ హీరోయిన్ సమంత చేసిన ఒక సోషల్ మీడియా పోస్ట్ ప్రత్యేకంగా ఆకర్షిస్తోంది. సినిమా రిలీజ్ రోజున లెనిన్ టీమ్‌కు, ముఖ్యంగా అఖిల్‌కు ఆమె బెస్ట్ విషెస్ తెలియజేయడం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. సమంత తన పోస్ట్‌లో లెనిన్ ట్రైలర్‌ను షేర్ చేస్తూ చిత్ర యూనిట్ కు శుభాకాంక్షలు తెలిపారు. ఆల్రెడీ బ్లాక్ బస్టర్ వైబ్స్ వినిపిస్తున్నాయని పేర్కొంటూ, టీమ్‌కు మంచి సక్సెస్ దక్కాలని ఆకాంక్షించారు. సినిమా రిలీజైన రోజునే ఆమె చేసిన ఈ పోస్ట్ అభిమానుల దృష్టిని ఆకర్షించడమే కాకుండా, సినీ వర్గాల్లో కూడా చర్చకు దారితీసింది. రీసెంట్ గా సమంత ప్రధాన పాత్రలో వచ్చిన మా ఇంటి బంగారం మంచి సక్సెస్ ను అందుకున్న విషయం తెలిసిందే. ఆ సినిమా గురించి రీసెంట్ గా లెనిన్ ప్రమోషన్స్ లో అఖిల్ మాట్లాడారు. తాను లెనిన్ వర్క్స్ లో బిజీగా ఉండటం వల్ల సినిమాను ఇంకా చూడలేదని, కానీ లేడీ ఓరియెంటెడ్ సినిమాలో యాక్షన్‌కు పెద్దపీట వేయడం తనకు బాగా నచ్చిందని, సమంతకు మంచి సక్సెస్ దక్కినందుకు తనకెంతో సంతోషంగా ఉందని అన్నాడు. ఒకరి సినిమాపై మరొకరు ఇలాంటి సానుకూల స్పందన వ్యక్తం చేయడం అభిమానులను ఆకట్టుకుంటోంది. సమంత, నాగ చైతన్య పర్సనల్ లైఫ్ లో వేర్వేరు మార్గాలు ఎంచుకున్నప్పటికీ, అక్కినేని ఫ్యామిలీ మెంబర్స్ తో ఆమె వ్యవహారంలో ఎలాంటి మార్పు కనిపించలేదనే అభిప్రాయం ఇప్పుడు మరోసారి వ్యక్తమవుతోంది. వ్యక్తిగత విషయాలను వృత్తిపరమైన సంబంధాలపై ప్రభావం చూపకుండా, ఒకరి సక్సెస్ ను మరొకరు అభినందించడం మెచ్యూరిటీకి నిదర్శనమని పలువురు సినీ అభిమానులు అభిప్రాయపడుతున్నారు. సోషల్ మీడియాలో కూడా సమంత పోస్ట్‌కు విశేష స్పందన లభిస్తోంది. అక్కినేని ఫ్యాన్స్ తో పాటు సమంత ఫ్యాన్స్ కూడా ఈ వ్యవహారాన్ని ప్రశంసిస్తున్నారు. సినీ ఇండస్ట్రీలో ఆరోగ్యకరమైన వాతావరణానికి ఇలాంటి పరస్పర గౌరవమే బలమని, వ్యక్తిగత విభేదాల కంటే వృత్తిపరమైన మర్యాదకు ప్రాధాన్యం ఇవ్వడం మంచి పరిణామమని కామెంట్లు చేస్తున్నారు. ఇదిలా ఉంటే, లెనిన్ సినిమాకు ఫస్ట్ షో నుంచే ఆడియన్స్ నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వస్తోంది. మరి లాంగ్ రన్ లో ఈ సినిమా అఖిల్ కెరీర్లో స్పెషల్ ఫిల్మ్ గా నిలిచే కీలక మైలురాయిగా నిలుస్తుందా అనేది తెలియాల్సి ఉంది.

# పాప్‌స్టార్ కావాలని.. స్టార్ హీరోయిన్‌కి ఇంకా వదలని సంగీతం పిచ్చి!



నటి, గాయని శృతి హాసన్ తన మల్టీ-టాలెంట్‌తో ప్రేక్షకులను ఎప్పుడూ అలరిస్తూనే ఉన్నారు. సామాజిక మాధ్యమాలలో యాక్టివ్‌గా ఉండే ఈ స్టార్ బ్యూటీ.. ముంబై వర్షాల వేళ తను గడిపిన ఒక ప్రశాంతమైన, ఆహ్లాదకరమైన వేకువఝాము సంగతుల్ని అభిమానుల కోసం షేర్ చేసారు. తన దైనందిన జీవితంలోని సాధారణ ఆనందాలు, సంగీతంపై తనకున్న మక్కువను తెలియజేస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన ఒక ప్రత్యేక పోస్ట్ ప్రస్తుతం నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ముంబై వర్షాల నేపథ్యంతో కూడిన ఒక అందమైన వాతావరణంలో శృతి హాసన్ తన -సెమీ ఆఫ్ డే- రోజున కాస్త ఆలస్యంగా నిద్రలేచింది. ఉదయాన్నే నిద్రలేవగానే తనకు వచ్చిన ఒక అందమైన కలను, ఆ కలలోని భావనను మర్చిపోకముందే దానికి చక్కని స్వరాన్ని ఇవ్వాలని అనుకున్నారు. ఆ ఆలోచన రాగానే ఉదయం తాగే టీని కూడా పక్కనపెట్టి తన ఇష్టమైన ప్రదేశంలో కూర్చుని పియానోపై ఒక చిన్న ట్యూన్‌ను కంపోజ్ చేసారు. ఈ సందర్భంగా --ప్రతీదీ ఏదో ఒకటి అయిపోనవసరం లేదు..
కొన్ని సార్లు కేవలం ఉనికిలో ఉంటే చాలు - అంటూ జీవిత ంపై తనకున్న లోతైన భావాలను షేర్ చేసారు శ్రుతి. సంగీతంతో పాటు తన ఉదయపు అలవాట్లను కూడా శృతి ఈ పోస్ట్‌లో ప్రస్తావించారు. ఒక కళాకారిణిగా తనకు నచ్చిన ప్రదేశంలో స్వేచ్ఛగా నిద్రలేవడం.. పియానో వాయించడం... ఆ వెంటనే నెయ్యి తో చేసిన తనకెంతో ఇష్టమైన -ఇంగ్లీష్ బ్రేక్‌ఫాస్ట్ టీ-ని ఆస్వాధించడం వంటి చిన్న చిన్న విషయాలపై శ్రుతి కృతజ్ఞత భావాన్ని వ్యక్తం చేసింది. ముంబైలో పడుతున్న వర్షపు వాతావరణం ఈ క్షణాన్ని మరింత అందంగా మార్చిందని పేర్కొంది. ఈ ఆనంద సమయంలో శృతికి సంగీతంతో ఉన్న సుదీర్ఘ అనుబంధం ఈ పోస్ట్ ద్వారా మరోసారి వ్యక్తమైంది. నిజానికి శృతి హాసన్‌కు అద్భుతమైన కళాత్మక, సంగీత నేపథ్యం ఉన్న కుటుంబం నుండి వచ్చింది. పూర్వీకుల నుంచి సంగీత నేపథ్యం ఉన్న కుటుంబం. లెజెండరీ నటుడు కమల్ హాసన్, ప్రముఖ నటి సారికల కుమార్తెగా సెలబ్రిటీ ప్రపంచానికి కొత్తకాదు. కమల్ హాసన్ కేవలం నటుడిగానే కాకుండా మంచి ప్లేబ్యాక్ సింగర్‌గా, మ్యూజిక్ డైరెక్టర్‌గా కూడా పరిశ్రమలో తనదైన ముద్ర వేశారు. అలాగే తల్లి సారికకు కూడా సంగీతంపై ఎంతో మంచి అభిరుచి ఉంది. చిన్నతనం నుంచే సృజనాత్మక వాతావరణంలో పెరగడం వల్లే శృతికి కూడా సంగీతంపై అంతటి అపారమైన ప్రేమ ఏర్పడింది. అయితే పాప్ స్టార్ కావాలన్న తన కల మాత్రం ఇంకా నెరవేరలేదు. తన కలల్ని సాధించుకునేందుకు శృతి హాసన్ తన సంగీత ప్రస్థానాన్ని చాలా చిన్న వయసులోనే ప్రారంభించింది. కేవలం ఆరేళ్ల వయసులో ఉన్నప్పుడే తన తండ్రి నటించిన పాపులర్ చిత్రం -తేవర్ మగన్- (తెలుగులో క్షత్రియ పుత్రుడు) లో ప్లేబ్యాక్ సింగర్‌గా చిత్ర పరిశ్రమకు పరిచయమైంది. ఆ తర్వాత నటిగా ఎంత బిజీగా ఉన్నా... తనలోని గాయనిని ఎప్పుడూ లైవ్‌లోనే ఉంచుతూ.. రెగ్యులర్‌గా తను పియానో వాయిస్తూ... పాటలు పాడుతున్న వీడియోలను సోషల్ మీడియా వేదికగా అభిమానుల కోసం షేర్ చేస్తూనే ఉంటుంది. తాజాగా శ్రు తి షేర్ చేసిన ఈ వీడియో సంగీతంపై తన మక్కువను మరోసారి రివీల్ చేసింది. శ్రుతి జీవితంలో తాను ఆశించినది సాధించుకోవాలనే పట్టుదలతో ఉన్నట్టు కనిపిస్తోందని నెటిజనులు వ్యాఖ్యానిస్తున్నారు. రెబల్ స్టార్ ప్రభాస్ - ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వచ్చిన -సలార్: పార్ట్ 1- భారీ విజయం సాధించిన సంగతి తెలిసిందే. దీనికి సీక్వెల్‌గా వస్తున్న -సలార్ 2-లో శృతి హాసన్ ఆద్యా పాత్రలో మళ్లీ కనిపించనుంది. ఈ సినిమా షూటింగ్ పనులు జరుగుతున్న సంగతి తెలిసిందే. దీనితో పాటు ఇంటర్నేషనల్ ప్రాజెక్ట్ అయిన -చెన్నై స్టోరీ-లో నటిస్తోంది. కొన్ని హిందీ సిరీస్‌లలోనూ భాగమైంది. వీటిపై మరింత అధికారిక సమాచారం త్వరలోనే రానుంది.

# సెట్ లో నిర్మాత దర్శకుడికి కళ్లెం వేయకూడదు!



సినిమా నిర్మాణం అనేది సృజనాత్మక ప్రక్రియ. ఒక సినిమాను తెరకెక్కించే క్రమంలో దర్శక, నిర్మాత మధ్య ఉండాల్సిన సమన్వయంపై టాలీవుడ్ నిర్మాత నాగవంశీ చేసిన వ్యాఖ్యలు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారాయి. షూటింగ్ సెట్‌లో నిర్మాత ఉండటం వల్ల ఖర్చు తగ్గుతుందనేది అపోహ మాత్రమేనని, పైగా అది అనవసరమైన గందరగోళానికి దారితీస్తుందని అభిప్రాయపడ్డారు. దర్శకుడి పనిలో నిర్మాత జోక్యం చేసుకోవడం వల్ల సినిమా నాణ్యత దెబ్బతినడమే కాకుండా సృజనాత్మకతకు అడ్డుకట్ట పడుతుందని అభిప్రాయపడ్డారు. సెట్‌లో ఉన్నప్పుడు టెక్నీషియన్లు గానీ, ఇతర సిబ్బంది గానీ ఏదైనా అవసరమని అడిగినప్పుడు, నిర్మాత అక్కడ ఉంటే వద్దు అని చెప్పడం సాధ్యం కాదు. ఆ సమయంలో ఖర్చు పెరుగుతుందే తప్ప తగ్గదని నాగవంశీ అన్నారు. . నిర్మాణం సవ్యంగా సాగాలంటే? దర్శకుడికి తన పని తాను చేసుకునే స్వేచ్ఛ ఉండాలి. నిర్మాత ఎప్పుడూ సెట్‌లో ఉండి ప్రతి విషయంలోనూ జోక్యం చేసుకుంటూ దర్శకుడిని నియంత్రించాలని చూస్తే ఆ పనిలో సహజత్వం లోపిస్తుందని తాను బలంగా నమ్ముతానన్నారు. దర్శకుడి పీక మీద కత్తి పెట్టి పని చేయించకూడదు అనేది నాగవంశీ ప్రధాన వాదన. సినిమా అనేది ఒక కలయిక. అందులో దర్శకుడి విజన్ ముఖ్యమైనది. ఆ విజన్‌కు అనుగుణంగా వనరులను సమకూర్చడం నిర్మాతల బాధ్యత. అంతే కానీ షూటింగ్ జరుగుతున్న ప్రతి నిమిషం ఖర్చుపైనే దృష్టి పెట్టి దర్శకుడిని ఒత్తిడికి గురి చేస్తే అతను అనుకున్న అవుట్‌పుట్ రాదు. సినిమా కోసం అవసరమైన ఖర్చు ఎలాగూ అవుతుంది. అది సెట్‌లో నిర్మాత ఉన్నా లేకున్నా మారుతుందే తప్ప ఆగేది కాదని గుర్తు చేశారు. నాగవంశీ చెప్పిన మాటల్లో వాస్తవం లేకపోలేదు. సినిమా కోసం కోట్లు ఖర్చు చేసేటప్పుడు ఆ పెట్టుబడిపై దృష్టి పెట్టడం నిర్మాతల బాధ్యతే అయినప్పటికీ షూటింగ్ స్పాట్‌లో దర్శకుడిని స్వేచ్ఛగా వదిలేయడం వల్ల అతను తన ప్రతిభను పూర్తిస్థాయిలో చూపించే అవకాశం ఉంటుంది. సెట్‌లో నిర్మాతల అతి జోక్యం వల్ల దర్శకులు క్రియేటివ్ ఫ్రీడమ్ కోల్పోయి సినిమా ఫలితంపై ప్రభావం పడే ప్రమాదం ఉంది. ప్రస్తుత కాలంలో పద్ధతులు మారుతున్నాయి. నిర్మాత తన ఇన్వెస్ట్‌మెంట్‌ను ఎలా తిరిగి రాబట్టుకోవాలి లేదా సినిమా క్వాలిటీ ఎలా ఉండాలి అనే దానిపై ముందుగానే చర్చించుకుంటే సరిపోతుంది. షూటింగ్ సమయంలో మాత్రం దర్శకుడికి పూర్తి స్థాయి బాధ్యత అప్పగించి నిర్మాతలు పర్యవేక్షకులుగా మాత్రమే ఉండాలని నాగవంశీ వ్యాఖ్యల సారాంశం. ఇది పరిశ్రమలో ఆరోగ్యకరమైన పని వాతావరణాన్ని పెంచడానికి సహాయపడుతుంది. నిర్మాతలు -దర్శకుల మధ్య ఉండాల్సిన సంబంధం ఒకరిపై ఒకరు గౌరవం పెంచుకునేలా ఉండాలి. సినిమా నాణ్యత పెరగాలంటే దర్శకుడికి కావాల్సిన స్వేచ్ఛను ఇవ్వడం తప్పనిసరి. నిర్మాతలు సెట్‌లో ఉండి నిఘా పెట్టడం కంటే ప్లానింగ్‌లో జాగ్రత్తలు తీసుకోవడం వల్ల మెరుగైన ఫలితాలు వస్తాయని నాగవంశీ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. సినిమా సక్సెస్ అవ్వాలంటే దర్శకుడు స్వేచ్ఛగా ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

Printed , Published and Owned by POLAGONI ALIVELU, and Printed at Smilys Online, 6-7-48, Vanasthalipuram, Shopping Complex, Rangareddy-500070. Telangana State and Published from 17-10-25, Plot No.H.No. 4-136/12, Turkayamjal Journalist Colony, Rangareddy501510, Telangana State. Editor: POLAGONI ALIVELU. PRGI No. TGTEL/25/A3190. Phone No: +91 7989151815